క్లుప్తంగా

దమ్ము చక్రాలతో రోడ్లపైకి వస్తే చర్యలు : సీఐ



కారెంపూడి: దమ్ము చక్రాలతో రోడ్లపైకి వచ్చే ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదు చేస్తామని కారెంపూడి సీఐ టీవీ శ్రీనివాసరావు ఆదివారం హెచ్చరించారు. ఇప్పటివరకు ట్రాక్టర్ డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చి వదిలివేయడం జరిగిందని సోమవారం నుంచి కేసులు నమోదు చేస్తామని, రైతులు గమనించి రోడ్లపైకి వీల్స్‌తో ట్రాక్టర్లను తిప్ప వద్దని విజ్ఞప్తి చేశారు. కనీసం అరగంట సమయం కేటాయిస్తే వీల్స్ తీసి పొలాలకు వెళ్లవచ్చని అలా కాకుండా వీల్స్‌తోనే పొలాలకు ప్రధాన రహదారుల గుండా వెళ్లడం వల్ల రోడ్లపై గాట్లు పడి రోడ్లు పాడైపోతున్నాయని ప్రజల ఆస్తికి నష్టం జరుగుతోందన్నారు. ఇది ఒక రకంగా మోటార్‌వెహికల్ యాక్టును కూడా ఉల్లంఘించడమేనని అలా ఎవరూ చేయవద్దని, చేస్తే మాత్రం పీడీపీపీ యాక్టును కూడా పెట్టాల్సి వస్తుందని సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు.

సంక్రాంతికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఆర్టీసీ డీఎం బత్తుల వీరాస్వామి

మాచర్ల: సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్, సికింద్రాబాద్‌కు మాచర్ల ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 9వ తేదీ నుంచి 13 వరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి తెలిపారు. తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 9న సూపర్ లగ్జరీ బస్సులను హైదరాబాద్‌కు నడుపుతామన్నారు. అదే విధంగా 10వ తేదీన మాచర్ల నుంచి సూపర్ లగ్జరీ, 9 ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నడుపుతామన్నారు. 11వ తేదీన సూపర్ లగ్జరీ, 7 ఎక్స్‌ప్రెస్‌లు, 12న 9 ఎక్స్‌ప్రెస్‌లు, సూపర్ లగ్జరీ, 13వ తేదీన మాచర్ల నుంచి సూపర్‌లగ్జరీ నడపటం జరుగుతుందన్నారు. ఈ ప్రత్యేక బస్సులలో సాధారణ ఛార్జీలు వసూలు చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు కంట్రోల్ పాయింట్ వద్ద 9959225432 నెంబరులో సంప్రదించాలన్నారు.

పన్నుల వసూళ్లకు ప్రత్యేక చర్యలు

మాచర్ల: పట్టణంలో పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఆస్తి, నీటి పన్నుల వసూలుకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు చెప్పారు. పురపాలక సంఘ అభివృద్ధిలో భాగంగా ప్రజలకు వివిధ సేవలందించటంతో పాటు ఆస్తి, నీటి పన్ను వసూలు చేయటంపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ఆదాయాన్ని పెంచే కార్యక్రమంలో భాగంగా పన్నుల వసూలుకు సచివాలయంతో పాటు పురపాలక ఉద్యోగులను విధులను కేటాయించి వసూలు చేయనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు మార్చిలోపు పన్నులు చెల్లించాలని కోరారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా బోయ నాగిరెడ్డి



రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలకు చెందిన బోయ నాగిరెడ్డిని బీజేపీ మండల అధ్యక్షుడిగా నియమిస్తూ పార్టీ జిల్లా నాయకత్వం ఆదేశాలు జారీ చేసినట్లు ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పోకూరి కాశీపతి ఆదివారం తెలిపారు. నాగిరెడ్డికి పలువురు అభినందనలు తెలిపారు.

అనాథశ్రమానికి బియ్యం వితరణ



సత్తెనపల్లి: పట్టణంలోని సాధన అనాథ వృద్ధులు ఆశ్రమానికి విలియం కేరీ మెమోరియల్ స్వచ్ఛంద సేవా సంస్థ, 8వ వార్డు క్రిస్టియన్ పేట కమిటీ సభ్యులు ఆదివారం 25 కేజీల బియ్యం వితరణ చేశారు.ఈ సందర్భంగా ప్రత్తిపాడు తహసీల్దార్ గుజ్జర్లపూడి కరుణకుమార్ మాట్లాడుతూ అనాథ వృద్ధులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గుజ్జర్లపూడి లాభాను, గుజ్జర్లపూడి మనోజ్‌కుమార్, బంకా బాబురావు, గుజ్జర్లపూడి చిన్నకృపారావు, గుజ్జర్లపూడి యోహాను తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాల స్వీకరణకు నేడు ఆఖరు

సత్తెనపల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు షెడ్యూల్ కులాల సర్వేపై ప్రస్తుతం సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నందున సంబంధిత ముసాయిదా జాబితాపై అభ్యంతరాలుంటే సోమవారం లోపు తెలియజేయాలని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 26న పట్టణంలోని అన్ని సచివాలయాల్లో ప్రచురించినట్లు వెల్లడించారు. అభ్యంతరాలను ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేయవచ్చని పేర్కొన్నారు. అభ్యంతరాలపై విచారణ చేసి తుది జాబితాను ఈ నెల 10న ప్రచురిస్తామని తెలిపారు.

అధ్వాన పారిశుద్ధ్యంతో అవస్థలు

- మల్లవరంలో పడకేసిన పారుశుద్ధ్యం
- వ్యాధుల బారిన పడుతున్న జనం
- మాయమవుతున్న గ్రామ పంచాయతీ నిధులు
- సమస్యలు పట్టించుకోని స్థానిక అధికారులు



మల్లవరంలో రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు



గ్రామంలో రోడ్లవెంట చెత్త కుప్పలు

రెంటచింతల: మండలంలోని మల్లవరం గ్రామంలో ఎటు చూసిన అధ్వానమైన పారిశుద్ధ్యం కారణంగా గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని రహదారులకు ఇరువైపులనున్న సైడు కాల్వలలోని మురుగుపూడికలు తొలిగించకపోవడంతోపాటు బ్లీచింగ్, ఫాగింగ్ చేయించకపోవడంతో దోమలు, ఈగలకు నిలయాలుగా మారి గ్రామస్తులు వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నారు. అంతర్గత రహదారులకు ఇరువైపుల డ్రైనేజ్ కాలువలు అస్తవ్యస్తంగా ఉండటం కారణంగా మురుగు నీరంతా ఇళ్ల పరిసరాలలో నిల్వ ఉండటంతో పాటు రహదారిపై ప్రవహించడంతో తటాకాలను తలపిస్తున్నాయి.

నిధులున్నా.. చర్యలు సున్నా..

అధ్వాన పారుశుద్ధ్యం వలన దోమలు వృద్ధిచెందడంతో టైఫాయిడ్, మలేరియాలతోపాటు డెంగీ వంటి విషజ్వరాల బారిన పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని మల్లవరం గ్రామానికి చెందిన సుగాలీ కాలనీ వాసులు వాపోతున్నారు. గ్రామంలోని కాలనీలలో పారుశుద్ధ్య పనులు చేపట్టడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామ పంచాయతీకి 15 ఆర్థిక సంఘం నిధులతో పాటు ఇతర ఆదాయాలు వస్తున్నా గ్రామంలో పారుశుద్ధ్య సమస్యల పరిష్కారానికి స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యహరిస్తున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



మా కాలనీలోని సైడు కాల్వలలో పూడికలు తీయించకపోవడంతో మురుగునీరు రహదారులపై పారుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలం వచ్చిందంటే చెరువులను తలపిస్తున్న రహదారులపై నడవలేక నరకం కన్పిస్తుంది. కాలనీలలో పారుశుద్ధ్య పనులు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కొర్రా బిచ్చాలు నాయక్, మల్లవరం

రోగాల బారిన పడుతున్నాం..



మురుగునీరు రహదారులపై పారుతుండటంతో పాటు అధ్వానమైన పారుశుద్ధ్యం కారణంగా విష జ్వరాలతో పాటు వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నాం. సైడు కాల్వలలో పూడికలు తొలగించి బ్లీచింగ్, ఫాగింగ్ చేయించాలని స్థానిక అధికారుల దృష్టికి తీసుకుపోతున్నా పట్టించుకోవడం లేదు.

– వడితే బావనమ్మ, మల్లవరం

ఇష్టపడి చదివితే ఉన్నత స్థానాలకు..

దాచేపల్లి: ప్రతి ఒక్క విద్యార్థి ఇష్టపడి, పోటీతత్వంతో చదివి ఉన్నతస్థాయికి చేరుకోవాలని హెచ్‌ఎం పాలేటి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దాచేపల్లిలో పల్నాడు జిల్లా స్థాయి పదవ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ పరీక్ష ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్షల్లో పిడుగురాళ్ల జెడ్పీ పాఠశాల విద్యార్థి ఏలూరు పూర్ణ వెంకట శ్రీనివాసరావు ప్రథమ స్థానం, అచ్చంపేట జెడ్పీ పాఠశాలకు చెందిన చలవాది సందీప్ ద్వితీయ స్థానం, ఒప్పిచర్ల జెడ్పీ పాఠశాలకు చెందిన అంగడి పావని చంద్రిక, బ్రాహ్మణపల్లి జెడ్పీకి చెందిన పల్లపోలు హర్షవర్ధన్ రెడ్డిలు తృతీయ స్థానం సాధించారని హెచ్‌ఎం తెలిపారు. అదే విధంగా ప్రతిభ కనబరచిన 12 మంది విద్యార్థులకు కన్సోలేషన్ బహుమతులు అందించామన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాలేటి శ్రీనివాసరావు, దాదాపు 40 పాఠశాలల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో పి. సీతారామయ్య ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సమావేశం ప్రారంభం కానుందని పేర్కొన్నారు.

అండర్‌-15 చెస్ పోటీలు ప్రారంభం



చెస్ పోటీలు ప్రారంభించిన పోలూరి నరసింహారావు, శ్రీనివాసరెడ్డి, తదితరులు

మాచర్ల: చదరంగం ఆడటం వల్ల విద్యార్థులలో ఏకాగ్రతను పెరుగుతుందని మాచర్ల మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం స్థానిక కోదండ రామ దేవాలయ ఆవరణలో పల్నాడు చెస్ అకాడమీ ఆధ్వర్యంలో వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ సహకారంతో అండర్‌-15 చదరంగం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగినసభకు వాసవి క్లబ్ జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి పోలూరి నరసింహారావు, మాట్లాడుతూ చెస్ ఆడటం వల్ల విద్యార్థులకు జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. న్యూటన్స్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ జున్నా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ చెస్ ఆడటం వల్ల విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. పోటీల్లో వివిధ పాఠశాలల నుంచి 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు భవనాసి రవితేజ, కార్యదర్శి బత్తుల వీరబ్రహ్మం, కోశాధికారి బచ్చు రాజకుమార్, పాస్ట్ రీజియన్ చైర్మన్ మేడం నాగేశ్వరావు, పాస్ట్ ప్రెసిడెంట్ తిరివీధి వెంకట నాగేశ్వరరావు, చుండూరు సత్యనారాయణ, చెస్ కోచ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దీక్షాదక్షతే లక్ష్య సాధనకు దిక్సూచీ



విద్యార్థులకు మోటివేషన్ క్లాసు నిర్వహిస్తున్న కాళహస్తి సుబ్బారావు

యడ్లపాడు: దీక్షాదక్షత లేకుండా మనిషి జీవితంలో ఏది సులభంగా రాదని చెన్నై వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ ఫ్యాకల్టీ కాళహస్తి సుబ్బారావు చెప్పారు. మండలంలోని లింగారావు పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 9,10 విద్యార్థులకు మోటివేషన్ తరగతుల్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన విద్యార్థులకు విలువైన విషయాలపై చైతన్యం కలిగించారు. ప్రధానంగా తొమ్మిది లక్షణాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. దూరదృష్టి, చదువుపై ఆసక్తి, క్రమశిక్షణ, ఉన్నతస్థాయికి ఎదగాలనే బలమైన కోరిక, విద్యా సంబంధమైన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని తెలిపారు. సరైన వైఖరి, సమయ పాలన, వినయం, నిరంతర కృషి లక్షణాలు ప్రాథమిక దశ నుంచే విద్యార్థులు పెంపొందించుకోవడం ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వి. రామిరెడ్డి, ఉపాధ్యాయులు డి. సుధాకర్, యు. మల్లేశ్వరి, గ్రామ పెద్దలు నంబూరు శివరామకృష్ణయ్య, గోగడ హరిబాబు, గుంటుపల్లి రమణయ్య పాల్గొన్నారు.

‘వీక్షణం’ ఎడిటర్ వేణుగోపాల్‌పై దాడి హేయం



పోస్టర్లు ప్రదర్శిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్‌పై దాడిని ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఆదివారం స్థానిక స్టేడియం దగ్గర దాడిని ఖండిస్తూ పోస్టర్లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత నెల 29న హైదరాబాదు బుక్ ఫెస్టివల్‌లో షాపు నిర్వహిస్తున్న వీక్షణం బుక్ స్టాల్‌లో హిందుత్వంపై వ్యతిరేకించే పుస్తకాలున్నాయని కొందరు ఘర్షణకు దిగి, దుర్భాషలాడినట్లు తెలిపారు. యూట్యూబ్ ఛానల్‌లో అసభ్యకరంగా, రౌడీల్లాగా, చట్టవ్యతిరేకంగా పోస్టులు పెడుతూ బెదిరింపులకు దిగారని చెప్పారు. ఇలాంటి శక్తులు గతంలో కూడా గౌరీ లంకేష్, కల్బుర్గి లాంటి మేధావులను హత్య చేశారని తెలిపారు. చట్టబద్ధ పాలనని, చట్టాన్ని గౌరవిస్తున్నామని పేరుతో ఇలాంటి శక్తుల్ని ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను ఖండించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. కోట నాయక్, పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మస్తాన్‌వలి, జి.రామకృష్ణ, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చికినం చిన్న, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్టీయూ నేతలకు సత్కారం



వినుకొండ(నూజెండ్ల): నరసరావుపేటలోని పల్నాడు జిల్లా ఎస్టీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన వార్షిక కౌన్సిల్ సమావేశంలో వినుకొండ నియోజకవర్గానికి చెందిన ఎస్టీయూ నాయకులను ఘనంగా సత్కరించారు. నాయకులు గంటా నాగేశ్వరరావు, ఆకుల శ్రీనివాసరావు, వల్లెపు శ్రీరాములు, కన్నెబోయిన బాలకృష్ణరావులను జిల్లా, రాష్ట్ర కార్యవర్గం సభ్యులు సన్మానించారు.

శావల్యాపురంలో...

నరసరావుపేట ఎస్టీయూ కార్యాలయంలో ఆదివారం మండల శాఖ అధ్యక్షులు బిళ్లా రాజారమేష్, కార్యదర్శి కంప శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు కొండ్రముట్ల వెంకటరత్నంను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి మాట్లాడుతూ మండలస్థాయిలో సంఘ కార్యకలాపాలను విజయవంతం చేయటంతో పాటు ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే దిశగా నేతలు పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, పూర్వ అధ్యక్షులు జోసఫ్‌సుధీర్‌బాబు, జిల్లా అధ్యక్షులు చంద్రజిత్‌యాదవ్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్యాయత్నం

నకరికల్లు: కేసు విషయమై రోజు పోలీసు స్టేషన్‌కు పిలిపిస్తున్నారంటూ మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి పోలీసు స్టేషన్ ఎదుట ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నకరికల్లుకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త దేవంగి వెంకట్రావు, మరొక వ్యక్తికి మధ్య గత కొన్ని రోజుల క్రితం ఘర్షణ జరిగింది. దీంతో వెంకట్రావుపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొన్ని రోజులుగా పోలీసు స్టేషన్‌కు రోజు పిలిపిస్తున్నారని మనస్తాపానికి గురైన వెంకట్రావు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన నరసరావుపేట ఏరియా వైద్యశాలకు అతనిని తరలించారు. ఈ విషయమై ఎస్ఐ చల్లా సురేష్‌ను వివరణ కోరగా ఇద్దరి మధ్య ఘర్షణ నేపథ్యంలో ఫిర్యాదు మేరకు విచారణ చేసి స్టేషన్ బెయిల్‌కు సిద్ధం చేస్తున్నామని వివరణ ఇచ్చారు.

నేడు నీటి సంఘాల సభ్యులకు అవగాహన సదస్సు


పిడుగురాళ్ల: నూతనంగా నీటి సంఘాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన అందరికీ అవగాహన సదస్సు సోమవారం పట్టణంలోని నీటిపారుదల శాఖ డీఈ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు నీటి పారుదల శాఖ ఏఈ ఆదినారాయణ ఆదివారం తెలిపారు. సాగు నీటి కాలువల నిర్వాహణ, ప్రభుత్వ నిధుల వినియోగం, రైతాంగ సమస్యల పరిష్కార అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమానికి నీటి సంఘాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు అందరు తప్పనిసరిగా హాజరు కావాలని ఏఈ సూచించారు.

ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే విడుదల చేయాలి



నరసరావుపేట: ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ, తదితర బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్టీయు డీ సంఘ రాష్ట్ర సలహాదారు బి.థామసయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక చదలవాడ కృష్ణయ్య ఉపాధ్యాయ భవన్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు వి.అరుణారావు అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంగం కోటేశ్వరరావు మాట్లాడుతూ పేరుకుపోయిన బకాయిలతో పాటు పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, అన్నీ సంఘాలతో చర్చలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఏ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయుల పట్ల వివక్షను ఆపేయాలని, యాప్‌ల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నూతన క్యాలెండర్‌ను స్థానిక శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో ఆవిష్కరించారు. కార్యక్రమంలో యం.సాంబశివరావు, ఆనందరావు, కోటేశ్వరరావు, కుంభా సాంబశివరావు, కాలేషావలి పాల్గొన్నారు.

వరి కోత మిషన్ లారీ బోల్తా



వినుకొండ(నూజెండ్ల): వరికోత మిషన్‌ను తీసుకెళ్తున్న లారీ పంట పొలంలోకి దూసుకువెళ్లి బోల్తా పడిన సంఘటన మండల కేంద్రం నూజెండ్ల బీసీ కాలనీ వద్ద ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు.. ప్రమాదవశాత్తు లారీ అదుపు తప్పి పొలంలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు,

రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

రైతు కూలీ సంఘం డిమాండ్



మాట్లాడుతున్న నల్లమల రైతు సంఘం నాయకుడు కొల్లా రాజ్ మోహన్

గురజాల: ఢిల్లీలో రైతులకు ఇచ్చిన హామీలను ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సత్వరమే నెరవేర్చాలని నల్లమడ రైతు కూలీ సంఘం నేత కొల్లా రాజమోహన్ డిమాండ్ చేశారు. స్థానిక రైతు కూలీ సంఘం కార్యాలయంలో ఆదివారం రైతు కూలీ సంఘం జనరల్ కౌన్సిల్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020లో మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా లక్షలాది మంది రైతులు ఢిల్లీని ముట్టడించి 13 నెలల పాటు ఉద్యమించారని ఆ ఉద్యమం కారణంగానే ఆ చట్టాలను రద్దు చేసి రైతులకు హామీ ఇచ్చారన్నారు. నేడు పంజాబ్ – హరియాణా సరిహద్దు ప్రాంతంలో 70 ఏళ్ల వృద్ధుడు జగజ్జీవన్ సింగ్ 40 రోజులుగా నిరాహార దీక్ష చేస్తుంటే మోదీ ప్రభుత్వానికి చలనం కూడా లేదన్నారు. రైతు కూలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కామ్రేడ్ పి. టాన్యా మాట్లాడుతూ దున్నే వానికే భూమి, దోపిడి లేని విద్యా సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బడా కార్పొరేట్ సంస్థలకు రూ.14.65 లక్షల కోట్ల అప్పులను రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం రైతుల రుణాలను మాఫీ చేయలేకపోవడం దారుణమన్నారు. పీఎం కిసాన్ నిధులను రూ.6వేలు నుంచి రూ.12వేలకు పెంచాలన్నారు. రైతుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. రైతు కూలీ సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా గనిరాజు ..

గురజాల: రైతు కూలీ సంఘం ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా యు.గనిరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక నందనం వెంకట్రావు నగర్ కాలనీ నందు ఆదివారం జిల్లా కార్యవర్గ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎన్.పోతురాజు, జి.సాంబయ్య, కేఎస్ఆర్, కార్యదర్శిగా రెడ్డి శ్రీను, సహాయ కార్యదర్శులుగా రాములమ్మ, వాగ్గేయ నాయక్, దూపాటి శ్రీను, కోశాధికారిగా కె.నరసింహారావు, కార్యవర్గ సభ్యులుగా పి.గోపయ్య, పెద సుబ్బయ్య, చిన సుబ్బయ్య, ఎం.కృష్ణ, కత్తి జ్ఞానమ్మ, చిన్నిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సాగరమాత ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు



సాగర్‌మాత దేవాలయంలో తేరు ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

విజయపురిసౌత్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సాగర మాత ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయ విచారణ గురువు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ మాట్లాడుతూ సర్వ మానవ పాపాలను తొలగించేందుకు దైవ కుమారుడైన ఏసుక్రీస్తు మానవరూపాన్ని ధరించి సమస్త జీవకోటి ఆచరించాల్సిన విధి, విధానాలను వెలుగులోకి తెచ్చారని వెల్లడించారు. ఏసుక్రీస్తు సూచించిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని పిలుపునిచ్చారు. దైవ సందేశాన్ని పాటించి సమాజంలో మంచి వ్యక్తులుగా గుర్తింపు పొందాలని చెప్పారు. అనంతరం దివ్యబలి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తేరు ప్రదక్షిణలో భక్తులు భారీగా పాల్గొన్నారు.

సేవకు ప్రతిరూపం ఇన్నర్ వీల్ క్లబ్

క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ ప్రేమలత

చిలకలూరిపేట: సేవకు ప్రతిరూపం ఇన్నర్ వీల్ క్లబ్‌అని క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ ప్రేమలత చెప్పారు. ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో డిస్ట్రిక్ చైర్మన్ ఆఫీషియల్ విజిట్ కార్యక్రమంలో భాగంగా ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రోటరీ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రేమలత మాట్లాడారు. క్లబ్ సభ్యులు సొంతనిధులు వెచ్చించి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు.

ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఫ్రీ మెడికల్ క్లినిక్‌కి రూ.10వేలు విలువ చేసే మందులను ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు గట్టు సరోజిని అందజేశారు. కావూరు జెడ్పీ హైస్కూల్‌కు వాలీబాల్ కిట్‌ను, స్థానిక చౌదరయ్య స్కూల్లో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థినికి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఇద్దరు పేద మహిళలకు రెండు కుట్టు మిషన్లు అందజేశారు. వృద్ధాశ్రమ నిర్మాణానికి రూ.లక్ష అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నార్నె విజయలక్ష్మి, దండా శేషమాంబ, రమాదేవి పాల్గొన్నారు.

9 నుంచి వివేకానంద జయంతి ఉత్సవాలు

మాచర్ల: శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు శ్రీ రామకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు మెట్టు గోవింద రెడ్డి తెలిపారు. మాచర్ల, తదితర గ్రామాలలో వారం రోజుల పాటు జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గోవింద రెడ్డి తెలిపారు.

జనవరి 12న జాతీయ యువజన దినోత్సవం, స్వామి వివేకానంద పుట్టినరోజు సందర్భంగా మాచర్ల పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లా ఎదురుగా ఉన్న స్వామి వివేకానంద విగ్రహం నివాళులర్పిస్తామని తెలిపారు.

వ్యాపారంలో రెడ్లు అభివృద్ధి సాధించాలి



నరసరావుపేట: వ్యాపారంలో ఉన్న రెడ్లు అందరూ ఒకరినొకరు సహకరించుకుంటూ అభివృద్ధి పథంలో పయనించాలని డాక్టర్ నవులూరి క్రాంతికుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ప్రకాష్ నగర్‌లోని ఎల్ఐసీ ఏజెంట్ తియ్యగూర వీరారెడ్డి కార్యాలయంలో రెడ్డి బిజినెస్ గ్రూపు(ఆర్‌బీజీ)కు చెందిన నూతన క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. డాక్టర్ క్రాంతికుమార్‌రెడ్డితో పాటు మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి, న్యాయవాది ఆరె శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు గానుగపంట ఉత్తమరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రెడ్ల అభివృద్ధికి తామంతా కృషిచేస్తామని పేర్కొన్నారు. అనంతరం ఆర్‌బీజీ రాష్ట్ర స్థాయి ప్రతినిధులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాలు పంచుకున్నారు. స్థానిక ఆర్‌బీజీ ప్రతినిధులు జి.సాంబశివారెడ్డి, యర్రంరెడ్డి నాగేశ్వరరెడ్డి, ఈదా లింగారెడ్డి, టి.శ్రీనివాసరెడ్డి, నుసుం వెంకటరెడ్డితో పాటు పలువురు రెడ్లు హాజరయ్యారు.

